
సాక్షి
గుంటూరు

గురువారం : 9 : నవంబర్ : 2023




గాయత్రి మహాయజ్ఞం

ముప్పాళ్ళ: చాగంటివారిపాలెంలో అఖిల విశ్వ గాయత్రి పరివార్ శాంతికుంజ్ హరిద్వార్ ఆధ్వర్యంలో బుధవారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4,322 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2,220 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.70 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,783 విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తు గడువు మళ్లీ పెంపు



యడ్లపాడు: పల్నాడు జిల్లా మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో రానున్న విద్యా సంవత్సరం (2024–25)లో 9,11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని ఈనెల 15 వరకు పెంచినట్లు ప్రిన్సిపల్ ఎన్.నరసింహారావు తెలిపారు. ఆయా తరగతుల్లోని మిగులు సీట్ల భర్తీకి నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు పల్నాడు జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలన్నీ అందులోనే ఉంటాయన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారు నమోదు చేసిన వివరాలు సరి చేసుకునేందుకు ఈనెల 16,17 తేదీల్లో అవకాశం ఉంటుందన్నారు.

ఏపీ గురుకుల పాఠశాలలో ఉద్యోగాలకు ఆహ్వానం

చిలకలూరిపేటటౌన్: ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయటానికి వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజాపేటలో గురుకుల పాఠశాలలో పనిచేయటానికి పీజీటీ ఫిజికల్ సైన్స్, పీజీటీ హిందీ, పీజీటీ సైన్సు, పీఈటీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు ఎమ్మెస్సీ ఫిజికల్ సైన్స్, బీఈడీ, హిందీ పండిట్ కోర్సు, బీఈడీ, డీపీఈడీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు.

యార్డులో 33,089 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 32,243 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,089 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి 24,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి రూ.24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,320 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సకాలంలో సర్జరీలు జరిగేలా చూడాలి



గుంటూరు మెడికల్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో ఆపరేషన్లు, స్పెషాలిటీ వైద్య సేవలు కావాల్సిన వారిని గుర్తించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు చెప్పారు. ఆవిధంగా అవసరమైన వారికి సకాలంలో ఆపరేషన్లు జరిగేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని వెల్లడించారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అవసరమని గుర్తించిన వారికి డిసెంబర్‌లోపు ఆపరేషన్లు చేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కంటి శస్త్రచికిత్సలు 2,500 మందికి తొలి దశలో చేయాలని గుర్తించామని, జీజీహెచ్‌తోపాటు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో కంటి ఆపరేషన్లు జరిగేలా చూడాలన్నారు. రిఫరల్ కేసులు ప్రతి ఒక్కటి చికిత్స పొందేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. గర్భిణులకు కన్సీవ్ అయిన వెంటనే యాంటినేటల్ రిజిస్ట్రేషన్ చేయించాలని, తద్వారా మాతృమరణాలు సంభవించకుండా నివారించవచ్చునని అన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓతోపాటు, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ పాల్గొన్నారు.

దివ్య 'ఔషధం'



అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందిస్తున్న దృశ్యం



చిన్నారులకు మందు వేస్తున్న ఆరోగ్య కార్యకర్త

బిడ్డకు భరోసా.. తల్లికి రక్షణ

- అంగన్‌వాడీ కేంద్రాలకు ఔషధ కిట్లు
- జిల్లాలోని 2,031 కేంద్రాలకు సరఫరా
- ఒక్కో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో 10 రకాల మందులు
- జిల్లాలో 1,25,239 మంది చిన్నారులకు ప్రయోజనం
- 24,316 మంది గర్భిణులు, బాలింతలకూ ఉపయోగమే
- పిల్లల ఆరోగ్యంపై ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ

పల్నాడు జిల్లాలో ఇలా..

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	9
అంగన్‌వాడీ కేంద్రాలు	2,010
మినీ కేంద్రాలు	10
గర్భిణులు	11,782
బాలింతలు	12,534
6నెలల్లోపు చిన్నారులు	12,612
6 నుంచి ఏడాదిలోపు పిల్లలు	12,583
ఏడాది నుంచి మూడేళ్ల పిల్లలు	51,771
3 నుంచి 6 ఏళ్ల మధ్య పిల్లలు	48,273

యడ్లపాడు: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చింది. మనబడి నాడు–నేడు ద్వారా పాత భవనాలు ఆధునికీకరించింది. ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు అద్దెను పెంచింది. కేంద్రాల నిర్వహణ, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపైనా శ్రద్ధ పెట్టింది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తోంది. చిన్నారులకు ఇంగ్లిష్‌లో బోధనకు శ్రీకారం చుట్టింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతినెలా మొదటి, మూడో శుక్రవారాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యులు సందర్శించేలా ఆదేశాలిచ్చింది. గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ విధానం అమలు చేసింది. నాణ్యతలో రాజీ లేకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్(ఎస్‌ఓపీ) కచ్చితత్వం పాటించేలా చర్యలు చేపట్టింది. క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరి చేసింది. అంగన్‌వాడీల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు 19 రకాల ఆట వస్తువులతో కిట్లను అందించింది. పిల్లల ఎదుగుదలకు స్టడీ, ఇన్‌ఫాంటో మీటర్లు, సాల్టర్ స్కేల్, బరువు తూచే యంత్రాలను సమకూర్చింది.

అత్యవసర కిట్ల పంపిణీ

తాజాగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు అత్యవసర ప్రాథమిక చికిత్స(ఫస్ట్ ఎయిడ్) కిట్లను పంపిణీ చేసింది. ఈ కిట్లలో పారాసిటమాల్ సిరప్, ఐరన్ టాబ్లెట్లు, అయోడిన్, సిల్వర్ సల్ఫాడైజిన్, క్లోరో ఫినరామిన్ మాలియట్, ఫురాజోలిడిన్, హ్యాండ్‌శానిటైజర్, రోలర్ బ్యాండేజ్, నియోమైసిన్ ఆయింట్‌మెంట్, కాటన్, సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు, బెంజయిల్, బెంజోయేట్, మరికొన్ని సిరప్‌లు ఉన్నాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పేరిటా పిల్లల్లో సాధారణంగా వచ్చే వ్యాధులు, ఏయే మందులను ఎంతెంత మోతాదులో ఎలా వినియోగించాలో పేర్కొంటూ తెలుగులో సమాచారాన్ని కూడా పంపించారు. ఆయా మందుల వినియోగంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు వైద్యసిబ్బంది చే అవగాహన కల్పించారు.

ఎంతో ప్రయోజనం



పల్నాడు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకూ మెడికల్ కిట్లను పంపిణీ చేశాం. గతంలో కంటే ఈసారి వచ్చిన కిట్లలో ఎక్కువ మందులు ఉన్నాయి. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పిల్లలకు జ్వరం, చిన్న పాటి గాయాలు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కిట్టులోని మందులు ఎంతగానో ఉపయోగపడతాయి. పిల్లల్లో సాధారణంగా వచ్చే చర్మ వ్యాధుల నిర్మూలనకు సంబంధించిన ఆయింట్‌మెంట్లు ఇందులో ఉన్నాయి.

– బి.అరుణ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, పల్నాడు జిల్లా

పిల్లల ఆరోగ్య పరిరక్షణకు..



ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ప్రతి 3,4 రోజులకొకసారి అంగన్‌వాడీ కేంద్రాల్ని పర్యవేక్షిస్తారు. కేంద్రంలోని పిల్లల పెరుగుదల, ఎత్తు, బరువు పరీక్షల నిర్వహణతోపాటు కిట్లలోని మందుల్ని అవసరమైన వారికి అందిస్తారు. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లోని మందులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తారు.

– ఎం.జోజమ్మ, సూపర్‌వైజర్, ఐసీడీఎస్ సొలస సెక్టార్

జగన్‌తోనే ఏపీ హ్యాపీ

- ప్రగతి, సంక్షేమం కొనసాగాలంటే ఆయనే మళ్లీ రావాలి
- నేటి నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' ప్రచార కార్యక్రమాలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యవరప్రసాద్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల 9 గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' అనే ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా, ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి రోశయ్య మాట్లాడారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని సచివాలయాల వారీగా 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యోగ, పెన్షన్లు తదితర రంగాల్లో ఏపీని సీఎం వైఎస్ జగన్ ముందంజలో ఉంచారని ఉద్ఘాటించారు. పేద ప్రజలకు మరింత న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌తోనే సాధ్యమని చెప్పారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు ఇంకా న్యాయం జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్ ఆనందంగా ఉంటుందని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలని చెప్పారు.

2.50 లక్షల పరిశ్రమలు

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ఏపీ నుంచి పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు వెళ్లిపోతున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గత టీడీపీ హయాంలో సుమారు 38 వేల పరిశ్రమలు వస్తే, సీఎం వైఎస్ జగన్ హయాంలో 2.50 లక్షల పరిశ్రమలు వచ్చాయని చెప్పారు. తద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు.

విప్లవాత్మక మార్పులు

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఏపీలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారని చెప్పారు. విద్య, వైద్య, వ్యవసాయ ఇతరత్రా రంగాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. దేశంలోనే ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా, తాడికొండ, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, అన్నాబత్తిని సదా, మక్కెన మల్లికార్జునరావు, జీఎంసీ ఉప మేయర్లు బాలవజ్రబాబు, షేక్ సజిల, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు మాదా రాధాకృష్ణమూర్తి, గనిక ఝాన్సీ, ముంతాజ్ పఠాన్, జేసీఎస్ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.74 లక్షలు విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం రూ.1.74 లక్షల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ పటాన్‌చెరువు ప్రాంతానికి చెందిన ఆర్. అశోక్‌గౌడ్ ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి ఈ మొత్తాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారి మధు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

'పీడీ'త జన రక్ష కోసం

- ఒకేరోజు నలుగురిపై పీడీ యాక్ట్
- గంజాయి అమ్మకాలు, రౌడీయిజంపై ఉక్కుపాదం
- ఐజీ పాలరాజు వెల్లడి




సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లా పరిధిలో ఒకేరోజున నలుగురిపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించటం, మరణాయుధాలు కలిగి ప్రజల్ని భయపెట్టటంలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు హెచ్చరించారు. పీడిత జన రక్ష కోసం కఠిన చర్యలకూ వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించకుండా, సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండేలా నడుచుకోవడం కోసమే ఇటువంటి శిక్షలు అమలు చేస్తామని, వీటినీ లెక్క చేయకుండా వరుస నేరాలకు పాల్పడితే ఎట్టిపరిస్థితిల్లోనూ చూస్తూ ఊరుకోబోమని ఆయన ఉద్ఘాటించారు. గుంటూరు జిల్లాలో పెదకాకాని, తెనాలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్, తెనాలి మూడో పట్టణ పోలీస్ స్టేషన్, దుగ్గిరాల పోలీసు స్టేషన్ పరిధిలో మొత్తం నలుగురు నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఐజీ పాలరాజు, గుంటూరు అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుప్రజ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధిలో శాంతి భద్రతలు, యువత భవిష్యత్తు పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలపై ప్రభావం పడేలా తీవ్ర నేరాలకు పాల్పడుతున్న వారిపై ఈ చట్టాన్ని ప్రయోగిస్తున్నట్లు స్పష్టం చేశారు. గుంటూరు రేంజ్ పరిధిలో నేరస్తుల కదలికలు, కార్యాకలాపాలపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నట్టు వివరించారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. ఈ యజ్ఞంలో ప్రజలూ భాగస్వాములు కావాలని, తమ ప్రాంతాలలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకం, తాగడం జరుగుతున్నట్టయితే 14500, కానీ కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 8688831568కి గానీ డయల్ చేయాలని, లేనిపక్షంలో దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని హామీ ఇచ్చారు.

పీడీ కేసులు నమోదైన వారు వీరే..

పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన 21 ఏళ్ల షేక్ లతీఫ్‌పై మూడు గంజాయి కేసులు నమోదయ్యాయి. తెనాలి ఐతా నగర్‌కు చెందిన 23 ఏళ్ల చేబత్తిన అఖిల్‌పై మూడు గంజాయి కేసులు ఉన్నాయి. చిన్నరావూరు శివాలయం వద్ద ఉండే 31 ఏళ్ల షేక్ నాయబ్ రసూల్‌పై రెండు హత్య కేసులు, దొంగతనం, కొట్లాట వంటి ఏడు కేసులు ఉన్నాయి. తెనాలి చెంచుపేటకు చెందిన 28 ఏళ్ల షేక్ అక్బర్‌పై దాదాపు 16 కేసులు నమోదు అయ్యాయి. ఈ నలుగురిపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఇప్పటివరకూ జిల్లాలో తొమ్మిది మందిని పీడీ యాక్ట్ ద్వారా రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపగా, బుధవారం మరో నలుగురిని పంపడంతో జిల్లాలో 13 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్టయింది.

యాంటీ బయాటిక్స్ ప్రమాదకరం



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

మంగళగిరి: అన్ని దేశాలలో యాంటీ బయాటిక్స్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోతోందని, ఇది మానవ జాతి మనుగడకు ప్రమాదకరంగా పరిణమించే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజులపాటు జరగనున్న యాంటీ బయాటిక్స్ వాడకం, ప్రత్యామ్నాయ మార్గాలపై అంతర్జాతీయ సదస్సును బుధవారం యూనివర్సిటీ వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరా ప్రారంభించారు. సదస్సుకు ఆరు దేశాల నుంచి ప్రఖ్యాతిగాంచిన 36 మంది శాస్త్రవేత్తలు హాజరై యాంటీ బయాటిక్స్ వాడకం, వ్యాధి నిరోధకత, వివిధ రోగాల నివారణపై చర్చించారు. అనంతరం మంగుళూరు నిట్టే యూనివర్సిటీ ఏఎంఆర్ ఇన్‌సైట్స్, నెదర్లాండ్స్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త డాక్టర్ బుర్రి రంగారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ల సలహా తీసుకుని మాత్రమే యాంటీ బయాటిక్స్ వాడాలన్నారు. మితిమీరిన యాంటీ బయాటిక్స్ వల్ల శరీరం విషతుల్యమయ్యే ప్రమాదముందన్నారు. అనంతరం బుక్‌లెట్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ జయశీలన్ మురుగయ్యన్, డాక్టర్ సుదర్శన్ గోవింద రాజన్, ప్రొఫెసర్లు వాన్‌డొంగెన్, డాక్టర్ ఇంద్రాణి కరుణసాగర్, డాక్టర్ రంజిత్ థాపా, డాక్టర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రాగన్ పండుగ



అద్దంకి ప్రాంతంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్

- బాపట్ల జిల్లాలో విస్తరిస్తున్న పంట
- అత్యధికంగా కొరిశపాడు, అద్దంకి, మార్టూరుల్లో సాగు
- ప్రభుత్వ సాయంతో మరింత పెరిగే అవకాశం
- ఔషధ గుణాలు మెండు



అద్దంకి: డ్రాగన్ ఫ్రూట్.. ఆరేళ్ల కిందట వరకు ఈ పండు గురించి చాలా తక్కువ మందికే తెలుసు. కరోనా తర్వాత దీని ప్రాముఖ్యం అందరికీ తెలిసింది. అధిక ఔషధ గుణాలు కలిగిన ఫలమిది. దీనిని పిటాయా అని కూడా పిలుస్తారు. దేశంలో మన రాష్ట్రంతోపాటు, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లోని రైతులు సాగు చేస్తున్నారు. ఇది బ్రహ్మజెముడు జాతికి చెందిన మొక్క. దీని ఫలంలో అధిక పోషక విలువలు ఉంటాయి. ఈ పండు పైనాపిల్, కివీ పండ్ల రుచిని పోలి ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ మొక్క సాగుకు సమశీతోష్ణ మండల ప్రాంతాలు బాగా అనుకూలం. అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది. నీటి ఎద్దడిని తట్టుకోగలుగుతుంది. మన దేశం అత్యంత అనుకూలం. ప్రస్తుతం కిలో రూ.250 వరకు పలుకుతోంది. ఎగుమతి చేస్తే మరింత ధర వచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో సాగు వివరాలు..

జిల్లాలోని అద్దంకి, కొరిశపాడు, వేటపాలెం, బల్లికురవ, మార్టూరు ప్రాంతాల్లో 58 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగు చేశారు. ఇందులో పింక్, వైట్, ఎల్లో వంటి రకాలు ఉంటాయి. వాటిలో పింక్‌కు బాగా గిరాకీ ఉంది. పల్నాడు జిల్లా గురజాల ప్రాంతంలో మొక్కలు లభిస్తాయి.

జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సాగు వివరాలు

ప్రాంతం	సాగు విస్తీర్ణం
అద్దంకి	4.76 హెక్టార్లు
కొరిశపాడు	7.28 హెక్టార్లు
బల్లికురవ	1.00 హెక్టార్లు
మార్టూరు	8.20 హెక్టార్లు
వేటపాలెం	0.38 హెక్టార్లు

రాయితీ ఇలా..

డ్రాగన్ తోటలను ప్రోత్సహించడం కోసం ఉద్యాన శాఖ రాయితీ ఇస్తోంది. హెక్టారుకు మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండు, మూడో సంవత్సరాలు రూ.10 వేల వంతున మొత్తం రూ.50 వేలు ఇస్తోంది.

తెగుళ్లకు దూరం

ఈ మొక్కను పెద్దగా తెగుళ్లు ఆశించవు. అప్పుడప్పుడు ఫంగస్ వంటి తెగుళ్లు ఆశిస్తాయి. ఉద్యాన శాఖ అధికారుల సలహాలతో అవసరమైన మందులను పిచికారీ చేసి నివారించుకోవచ్చు. షేడ్ సమస్యను తొలగించుకోవడం కోసం తోటలో మునగ మొక్కలను సాగు చేస్తే సరిపోతుంది.

సాగు విధానం..

పందిరి పద్ధతిలో నాటే ఈ మొక్కకు 400 నుంచి 420 సిమెంట్ పోళ్లు అవసరమవుతాయి. ఒక్కో మొక్క ఖరీదు రూ.80 వరకు ఉంటుంది. మూడేళ్ల వయస్సు తోటల నుంచి మొక్కలను కొనుగోలు చేసి తెచ్చి నాటుకోవచ్చు. హెక్టారుకు 1,100 నుంచి 1,350 వరకు మొక్కలు నాటవచ్చు. అధిక సాంద్రత పద్ధతిలో ఎకరాకు 445 నుంచి 546 మొక్కలను మొక్కకు మొక్కకు 2.5 మీటర్ల దూరం ఉండేలా నాటుతారు. డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే ఒక్కో మొక్కకు రోజుకు రెండు నుంచి నాలుగు లీటర్ల నీరు సరిపోతుంది. ఎకరాకు డ్రిప్, పోళ్లు, మొక్కలు, ఎరువులతో కలుపుకుని రూ.5 లక్షల వరకు వ్యయం అవుతుంది. ఒకటిన్నర సంవత్సరానికే కాపునకు వచ్చినా మంచి దిగుబడి రావడానికి మూడు సంవత్సరాలు పడుతుంది. బాగా ఎదిగిన తోట నుంచి ఎకరాకు 20 నుంచి 30 మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి వస్తుంది.

మూడెకరాల్లో వేశాం..



మేము మూడేళ్ల కిందట మూడెకరాల్లో డ్రాగన్ పంట వేశాం. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రాయితీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఏడాది కాపు పూర్తి కావస్తోంది. పండుకు బాగా గిరాకీ ఉంది. కిలో రూ.200పై మాటే. తోట దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

– ఈమని కృష్ణారెడ్డి, రైతు, పీ గుడిపాడు

రైతులను ప్రోత్సహిస్తున్నాం



డ్రాగన్ తోటలను సాగు చేసుకోవాలని రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఈ పండుకు మంచి గిరాకీ ఉంది. కిలో పండ్లు రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. అన్ని నేలల్లో పండుతుంది. మొదట ఖర్చు అయినా తరువాత లాభాలు వస్తాయి. ఉద్యాన శాఖ నుంచి హెక్టారుకు మూడేళ్ల వ్యవధిలో రూ.50 వేలు ఇస్తారు. సాగు విస్తీర్ణం క్రమేపీ పెరుగుతోంది.

– దీప్తి, ఉద్యానశాఖ అధికారి

దుర్గగుడి కీలక విభాగాలలో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గ గుడి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన కేఎస్ రామారావు తొలి సారిగా ఆలయంలోని కీలక విభాగాలను బుధవారం పరిశీలించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఇంజినీరింగ్ విభాగం, అకౌంట్స్ విభాగం, ఆర్జిత సేవల విభాగం, టోల్ ఫ్రీ కేంద్రం, దర్శన టికెట్ల విభాగాలను తనిఖీ చేశారు. ఆయా విభాగాల అధికారులతో మాట్లాడిన అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయా విభాగాలలో సిబ్బంది రోజు వారీ విధుల గురించి ఆరా తీయడమే కాకుండా పలు సూచనలు చేశారు. దుర్గగుడి ఈవోగా ఆయా విభాగాలకు నేరుగా వెళ్లి అధికారులను, సిబ్బందిని కలుసుకున్నట్టు ఈవో తెలిపారు.

క్లుప్తంగా

కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రజలు వివిధ రెవెన్యూ, ల్యాండ్ అంశాలపై కోర్టుల్లో వేసిన కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ కోర్టు కేసులు ఫైల్ చేసేటప్పుడు, సంబంధించిన డేటా సంక్షిప్తంగానూ, అర్థవంతంగానూ ఉండాలన్నారు. రెవెన్యూకు సంబంధించి ప్రతీ అంశం కూలంకషంగా రాసి పంపాల్సి ఉంటుందన్నారు. ఈక్రమంలో రెవెన్యూ అధికారులు లీగల్ బృందం సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కంటెంట్ కేసుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని స్పష్టం చేశారు.

ఈపూరు మండలంలో 33 మి.మీ. వర్షం

నరసరావుపేట: జిల్లాలోని 28 మండలాల్లో 23 మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం పడింది. అత్యధికంగా ఈపూరు మండలంలో 33.4 మి.మీటర్ల వర్షం నమోదు కాగా, సత్తెనపల్లి, అమరావతి, మాచవరం మండలాల్లో అత్యల్పంగా 0.8 మి.మీ. వర్షం కురిసింది. వివరాలు.. దుర్గిలో 3.2 మి.మీ., రెంటచింతలలో 12.0, గురజాలలో 20.4, దాచేపల్లిలో 7.4, కారంపూడిలో 16.4, పిడుగురాళ్లలో 30.4, బెల్లంకొండలో 5.4, అచ్చంపేటలో 8.8, క్రోసూరులో 28.6 మి.మీ వర్షం పడింది. అలాగే రాజుపాలెంలో 3.6, నకరికల్లులో 6.4, బొల్లాపల్లిలో 29.6, వినుకొండలో 12.4, నూజెండ్లలో 16.2, శావల్యాపురంలో 13.0, రొంపిచర్లలో 7.2, నరసరావుపేటలో 7.4, చిలకలూరిపేటలో 12.4, యడ్లపాడులో 6.4 వర్షపాతం నమోదైంది. కాగా, ఈనెలలో ఎనిమిది రోజులకు జిల్లా వ్యాప్తంగా 507.0 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 38.3శాతం అధికంగా 701.0 మి.మీ. వర్షం కురిసింది. ఇప్పటి వరకు ముప్పాళ్ల మండలంలో వర్షం పడలేదు.

పత్తి విక్రయాలకు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తి విక్రయించేందుకు వీలుగా పత్తి సాగు చేసే రైతుల వివరాలు రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆర్బీకేల్లో ఈ–క్రాప్ వివరాల ఆధారంగా పత్తి సాగు చేసే రైతులకు మద్దతు ధరకే సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల రైతులకు ఎరువుల అవసరం ఉంటుందని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఆర్బీకేల్లో వీటిని అందుబాటులో ఉంచాలన్నారు. జగనన్న లే–అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ప్రతి వారం అధికారులు సమీక్షించుకోవాలన్నారు. ఇప్పటికే పూర్తయిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్, మంచి నీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితా తయారు చేయాలి

ఎస్ఎస్ఆర్ 2024 ఓటర్ల జాబితాకు సంబంధించి అత్యంత పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా ఇప్పటికే విడుదల చేశామన్నారు. ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపుల్లో 4,743 క్లయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించామన్నారు. వచ్చేనెల 2, 3 తేదీల్లో మరలా క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాజకుమారి, జీఎంసీ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఉన్నతాధికారులు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మీ శివజ్యోతి



నిర్మల్ కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న అడిషనల్ కమిషనర్ హేమామాలిని

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ల బదిలీలో భాగంగా బాపట్ల డీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ శివజ్యోతిని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు కమిషనర్‌గా విధుల్లో చేరిన సందర్భంగా బుధవారం లక్ష్మీ శివ జ్యోతి నగర కమిషనర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

మంగళగిరి–తాడేపల్లి అభివృద్ధే ధ్యేయం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థను స్వచ్ఛ నగరంగా అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం బదిలీ అయిన నగర కమిషనర్ యు.శారదాదేవి స్థానంలో నియమితులైన నిర్మల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిత్యం పర్యటించి పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి నగరాన్ని స్వచ్ఛనగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.

టీడీపీకి ఓటు అడిగే హక్కులేదు

- వైఎస్సార్ సీపీ ప్రతి హామీ నెరవేర్చింది
- రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆస్తి, ఆరోగ్యం, విద్య జగనన్న అందించారు
- వై ఏపీ నీడ్స్ జగన్ సదస్సులో ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మకాయల తదితరులు

మంగళగిరి: 2014లో మోసపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసగించిన టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదని, 2019లో అధికారంలోకి వచ్చి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్సార్ సీపీకి మాత్రమే ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందని గుంటూరు, కృష్ణా జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని కల్యాణ మండపంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్ర ప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలంటే) సదస్సుకు అయోధ్య రామిరెడ్డి, మరో రీజనల్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సదస్సుకు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు అధ్యక్షత వహించగా మంగళగిరి పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు విజ్ఞులని అందుకే 2019లో టీడీపీకి బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలు రానున్న రోజులలో ప్రతి ఇంటికీ రూ.30 లక్షల నుంచి 40 లక్షల ఆస్తిగా మారుతుందన్నారు. రాష్ట్రంలోని 85 శాతం ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అడిగే హక్కు ఉందన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నియోజకవర్గాన్ని అభివృద్ధిపరచి రాష్ట్రానికే మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. ఎమ్మెల్యే ఆర్కే చేసిన అభివృద్ధి అంతా తెరచిన పుస్తకమని టీడీపీ నాయకులు లోకేష్ లేదా మరే నాయకుడైనా చర్చకు రావచ్చన్నారు.

మరో ముఖ్య అతిథి రీజనల్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందించిన సంక్షేమ పథకాలను వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సదస్సులో జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక ముఖ్యమంత్రి నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ, నా మైనార్టీ అని చెప్పి అండగా నిలబడినందకే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి కావాలంటున్నామని గౌరవంగా చెప్పే ధైర్యాన్ని బలహీన వర్గాలకు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు,రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, దుగ్గిరాల జెడ్పీటీసీ దాసరి అరుణకుమారి, ఎంపీపీ దానబోయిన సంతోషరూప వాణి, మార్కెట్ యార్డు అధ్యక్షులు మునగాల భాగ్యలక్ష్మి, షేక్ బాజి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎంటీఎంసీ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ, మండల కన్వీనర్లు బుర్రముక్క వేణుగోపాలస్వామి రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, దుగ్గిరాల కన్వీనరు శృంగారపాటి రత్నం, జేసీఎస్ కన్వీనర్లు ఎండీ ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి రెడ్డి, యేమినేని రవి పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నాలుగు మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. పొన్నూరు మండలంలో 12.2 మిల్లీ మీటర్లు, ప్రత్తిపాడు మండలంలో 11.8 మి.మీ., కాకుమాను మండలంలో 5.8 మి.మీ., పెదనందిపాడు మండలంలో 1.4 మి.మీ చొప్పున వర్షం పడింది.

ఓటుపై సందేహాల పరిష్కారానికి హెల్ప్ డెస్క్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఓటుపై సందేహాల పరిష్కారానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, ఓటర్ల జాబితా నూరు శాతం పారదర్శకంగా ఉండేలా బీఎల్ఓలు, సూపర్వైజరి అధికారులు బాధ్యత తీసుకోవాలని, ఓటు పై సందేహాలను నివృత్తి చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ చాంబర్ లో ఎన్నికల విధులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లకు తమ ఓటుకు సంబంధించిన ఏ సందేహం ఉన్నా తీర్చడానికి వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ని గురువారం నుంచి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లు తమ ఓటుకి సంబంధించి హెల్ప్ డెస్క్‌కి వచ్చి తెలుసుకోవచ్చని లేదా 0863–2345104, 2345105 నంబర్లకు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:30 గంటల లోపు ఫోన్ చేసి కూడా తెలుసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితా నూరు శాతం పారదర్శకంగా ఉండేలా బిఎల్ఓలు, సూపర్వైజరి అధికారులు బాధ్యత తీసుకోవాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, బీఎల్ఓలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్ఓలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లు జాబితా పై అడిగే సందేహాలను పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలోని పోలింగ్ కేంద్రాలకు నంబరింగ్ పూర్తి అయిందని, సూపర్వైజరీ అధికారులు తమ పరిధిలోని కేంద్రాలను పరిశీలించి, ఎక్కడైనా నంబరింగ్ లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితా, ఓటు పై అందే ఫిర్యాదులు, ఫారాలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఎన్నికల విభాగం శ్రద్ధ చూపాలని, అవసరమైతే అదనపు ఆపరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బీఎల్ఓలు ఇస్తున్న ఫారాలను ఏఈఆర్ఓలు నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. విధుల్లో వెనుకబడిన బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం, నిర్లిప్తత ఉండకూడదన్నారు. సమావేశంలో ఇంచార్జ్ అదనపు కమిషనర్ సి.హెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఎలక్షన్ సెల్ సూపరిండెంట్లు ప్రసాద్, సాంబశివరావు, పద్మ పాల్గొన్నారు.

వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత ఓపీ

గుంటూరు మెడికల్: వికాస్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 30 వరకు ఉచిత కన్సల్టేషన్‌తో వైద్య సేవలు అందిస్తున్నామని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు తెలిపారు. తమ ఆసుపత్రిలో బేసిక్, మాస్టర్, కార్డియాక్, హోల్‌బాడీ హెల్త్ ప్యాకేజీలు అత్యంత రాయితీతో అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరికీ అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గుంటూరులో వంద పడకలతో ఆసుపత్రిని ప్రారంభించినట్లు వెల్లడించారు. మార్కెట్ సెంటర్ కలెక్టరేట్ రోడ్డులోని తమ ఆసుపత్రిలో అందిస్తున్న ఉచిత ఓపీ కన్సల్టేషన్‌ను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పుట్టింట్లో వివాహిత ఆత్మహత్య

- అంతకుముందే విజయవాడ రైల్వేస్టేషన్‌లో వదిలి వెళ్లిన భర్త
- కుటుంబ కలహాలే కారణమంటూ పోలీసుల వెల్లడి

తాడేపల్లిరూరల్: వివాహమై రెండు సంవత్సరాలు కూడా పూర్తికాకుండా దంపతుల మధ్య వివాదం చోటు చేసుకుని చివరకు భార్య ప్రాణాలు తీసుకున్న ఘటన తాడేపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం ఉండవల్లి అమరావతి రోడ్డులోని కోలా సుబ్బారావు రోడ్డులో నివాసముంటున్న మాదా వెంకటరెడ్డి, రమణమ్మల కుమార్తె సాయి ఫణిలక్ష్మి (23) ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కృష్ణాజిల్లా, కాజ గ్రామానికి చెందిన మాదా వెంకటరెడ్డి రమణమ్మలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ కుటుంబం కృష్ణాజిల్లా నుంచి ఉండవల్లి వచ్చి నివాస ముంటూ వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుమార్తె సాయి ఫణిలక్ష్మికి కాకినాడ జిల్లా అగ్రహారం మండలం, దవనపల్లికి చెందిన నాగిరెడ్డికి ఇచ్చి 2021లో వివాహం చేశారు. వివాహానంతరం భార్యాభర్తలు హైదరాబాద్‌లో నివాసముంటూ ఓ ప్రైవేటు కంపెనీలో నాగిరెడ్డి ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ హైదరాబాద్ నుంచి నాగిరెడ్డి తన భార్య సాయి ఫణిలక్ష్మిని బుధవారం తెల్లవారుజామున విజయవాడ రైల్వేస్టేషన్‌లో దించి మామ వెంకటరెడ్డికి ఫోన్ చేసి మీ కూతురు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఉంది తీసుకువెళ్లమని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంకటరెడ్డి స్టేషన్‌కు వెళ్లి తన కుమార్తెను ఇంటికి తీసుకు వచ్చి ఏం జరిగిందని ప్రశ్నించాడు. తనకు ఆకలి వేస్తోందని చెప్పడంతో తల్లి అయిన రమణమ్మ అన్నం పెట్టింది. రేపు ఉదయం మాట్లాడుకుందాం మీరు పూలు కోయడానికి వెళ్లండని చెప్పడంతో తెల్లవారుజామున 3 గంటలకు వెంకటరెడ్డి, తన భార్య రమణమ్మతో కలసి ఇంటి సమీపంలో పూలు కోయడానికి వెళ్లారు. ఆ సమయంలో సాయి ఫణి లక్ష్మి పురుగుల మందు తాగి తండ్రికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పడంతో తండ్రి హడావిడిగా వచ్చి చూడగా కుమార్తె అపస్మారక స్థితిలో పడి ఉంది. ఇంటిపక్క వారి సహాయంతో విజయవాడలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందిందని వెల్లడించారు. తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నేడు న్యాయసేవల దినోత్సవం

నరసరావుపేట టౌన్: న్యాయ సేవా దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పి.వి.ఎస్.సూర్యనారాయణమూర్తి బుధవారం తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయసేవల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. పేద, బడుగుబలహీన వర్గాల వారికి, మహిళలకు సత్వర, సమర్థ, ఉచిత న్యాయ సేవలు అందించాలనే లక్ష్యంతో న్యాయ సేవాధికార చట్టం అమలులోకి వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కాలంలో 27 లోక్ అదాలత్‌లను నిర్వహించి 1908 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించామన్నారు. అదే విధంగా 42 ముందస్తు వ్యాజ్యాలు పరిష్కరించామన్నారు. 47 మందికి ఉచిత న్యాయ సహాయమందించినట్లు వివరించారు. 215 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ పరిధిలోని పట్టణ, గ్రామాల ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్స్ ఇంటికి ఉచిత న్యాయ సేవల గురించి, రోజువారీ జీవితంలో అవసరమైన చట్టాలను వివరించినట్లు తెలిపారు.

హత్య కేసులో ముద్దాయికి జీవితఖైదు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: హత్య కేసులో ముద్దాయికి కోర్టు జీవితఖైదు విధించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 2016లో కర్లపాలెం మండలం, పేరలి పంచాయతీ పరిధిలోని మేకలవారిపాలేనికి చెందిన మేకల ఫ్రాంక్లిన్ అదే గ్రామానికి గొర్రుముచ్చు రమేష్ మద్యం తాగుతూ గొడవ పడ్డారు. అదే సమయంలో రమేష్ కుమారుడు రవిబాబు మా నాన్నను ఎందుకు తిడుతున్నావని ఫ్రాంక్లిన్‌ను నిలదీశాడు.

దీంతో పిల్లవాడు నన్ను ఎదిరిస్తాడా' అని మనసులో పెట్టుకున్న ఫ్రాంక్లిన్ 2017 ఫిబ్రవరి 7న ఇంట్లోకి వెళ్లి హత్య చేశాడు. బాపట్ల సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు అడిషనల్ జడ్జి కె.పి.బాలాజీ ముద్దాయి ఫ్రాంక్లిన్‌కు జీవితఖైదు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పీపీ ఎం.శ్రీకాంత్ వాదనలు వినిపించారు.

ఉద్యోగులకు క్రీడా సాధన తప్పనిసరి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్దనరెడ్డి



టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న సీఎండీ

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో నిత్యం ఒత్తిడిలో ఉండే విద్యుత్ ఉద్యోగులు ప్రతి రోజూ కనీసం గంటసేపు క్రీడా సాధన చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మాజనార్దనరెడ్డి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఇంటర్ సర్కిల్ టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ టోర్నమెంట్–2023 పోటీల్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా మంది ఉద్యోగులు తమ పిల్లల్ని క్రీడాకారులుగా చూడాలనుకుంటారన్నారు. అయితే, ముందుగా తాను సాధన చేసి చక్కని ఆరోగ్యంతో ఉంటే కుటుంబం అంతా బాగుంటుందని చెప్పారు. పని ఒత్తిడిని తగ్గించే గొప్ప సాధన క్రీడలకుందని తెలిపారు. ముఖ్యంగా క్రీడల్లో గెలుపోటముల్ని సమానంగా స్వీకరించాలని సూచించారు. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని ఆయన కోరారు. అనంతరం ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్ఈ ఏ.మురళీకృష్ణ యాదవ్, సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ జయభారత్‌రావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వర్క్‌షాపులో పాల్గొన్న ప్రాజెక్టు మేనేజర్లు



వర్క్‌షాపులో పాల్గొన్న జిల్లా మేనేజర్లు రాజ కుమారి, అమలకుమారి, ప్రతినిధులు

తెనాలి టౌన్: ఢిల్లీలోని జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆడిటోరియంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై జరిగిన వర్క్‌షాపులో గుంటూరు, నరసరావుపేట జిల్లాల మేనేజర్లు కె.రాజకుమారి, కె.అమలకుమారి, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సీనియర్ లీడర్ డి.ప్రభాకర్ పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వ్యవసాయ అధికారులు, రైతు ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు పాల్గొన్న వర్క్‌షాప్‌కు కేంద్రం హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేషనల్ కో–ఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. ప్రకృ తి వ్యవసాయంతోనే రైతు సంక్షేమం సాధ్యమని హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నట్లు మేనేజర్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నుంచి ప్రకృతి వ్యవసాయం మేనేజర్లతో పాటు నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సుమ, ఎఫ్‌పీవో ప్రతినిధులు యర్రంశెట్టి హనుమంతరావు, దూళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

మాదలలో అగ్నిప్రమాదం

సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం

మాదల(ముప్పాళ్ల): ఓ చిల్లర దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని ప్రధానకూడలిలో పాట్టి శ్రీనివాసరావు, గృహంలోనే చిల్లరదుకాణం నిర్వహిస్తుంటాడు. దుకాణంలో మంటలు చెలరేగి చిల్లర సామగ్రికి అంటుకుంది. దుకాణంతో పాటుగా నివాస గృహం కూడా కావటంతో ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దుకాణంలోని ఫ్రిజ్‌లు, బీరువాలోని నగదు, బంగారం పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న సత్తెనపల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. నరసరావుపేట నుంచి మరో ఫైర్‌ఇంజన్‌ను పిలిపించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేపట్టారు. మొత్తం మూడు ఫైర్ ఇంజిన్‌లతో మంటలను అదుపులోకి తెచ్చేలా చర్యలు చేపట్టారు. సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని దుకాణ నిర్వాహకుడు శ్రీనివాసరావు తెలిపారు. ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోవటంతో కట్టుబట్టలతోనే మిగిలిపోయారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ తో మంటలు వ్యాపించాయని దుకాణ నిర్వాహకులు చెబుతుండగా, గ్యాస్ లీకై మంటలు వ్యాపించి పక్కనే ఉన్న దీపావళి మందులకు, పెట్రోల్ డబ్బాకు అంటుకొని ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద తీవ్రత అధికంగా ఉండటంతో ఇంటి పైకప్పు పగుళ్లిచ్చింది.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
గురువారం ॥ 9-11-2023



ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు, దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచివి కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



● ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు. ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో. పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు. ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.